
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 28.5
కనిష్ఠం 19.0

ANDHRAJYOTHY



నల్లగొండ

5

ఆదివారం 24 నవంబరు 2024



యాదగిరిగుట్టపై భక్తుల సందడి

- స్వామివారిని దర్శించుకున్న 32వేల మంది భక్తులు

6

వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది



నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాదిగల సమ్మేళనంలో మాట్లాడుతున్న రాజనర్సింహ

- సుప్రీం కోర్టు తీరు మేరకు అమలు
- జనాభా ప్రకారం రిజర్వేషన్ ఫలాలు అందాలి
- వన్ మెన్ కమిటీ నివేదిక ఆధారంగా వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- వర్గీకరణను వ్యతిరేకిస్తున్న వారికి అండగా ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులపై చర్య తీసుకోవాలి
- ఎమ్మెల్యే మందుల సామేలు

6

సుప్రీం కోర్టు తీర్పుప్రకారం వర్గీకరణ



నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాలల సమ్మేళనంలో మాట్లాడుతున్న జి.వినోద్

- కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను ప్రభుత్వం పాటించాలి
- డిసెంబరు 1న హైదరాబాద్‌లో మాలల సింహగర్జన
- నగరాన్ని నీలిమయం చేసేందుకు అంతా తరలిరావాలి
- మాలలపై ఏ పార్టీ కుట్ర చేసినా గుణపాఠం తప్పదు
- ఆర్‌ఎస్ఎస్ కుట్రతో మాపై మాదిగ నేతలతో విషప్రచారం
- బెల్లంపల్లి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు జి.వినోద్, కేఆర్.నాగరాజు

6

న్యూస్ బాక్స్

ఘనంగా లక్ష్మి అమ్మవారికి పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నల్లగొండకల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పానగల్లు పచ్చల సోమేశ్వర స్వామి దేవాలయంలో శివ స్వాములు ఆధ్వర్యంలో శనివారం లక్ష్మి అమ్మవారికి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం శివ స్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివగురు స్వాములు చాపల యాదయ్య, హరి, బాలకృష్ణ, శోభన్‌బాబు, శంకర్, సోమయ్య, పూజారి నాగరాజు, పాల్గొన్నారు.

నేడు నార్కట్‌పల్లిలో యూటీఎఫ్ జిల్లా మహాసభ

నార్కట్‌పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభ నార్కట్‌పల్లిలో ఈనెల 24న నిర్వహించనున్నారు. సుమారు 500 మంది ఉపాధ్యాయులు ఈ సభకు హాజరు కానున్నారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి వచ్చే మార్చిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న ఈ మహాసభలను నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ మేరకు యూటీఎఫ్ మండల శాఖ బాధ్యులు ఏర్పాట్లు చేశారు. మహాసభలకు మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలను ఆహ్వానించారు. అదేవిధంగా సంఘం రాష్ట్ర బాధ్యులు హాజరు కానున్నారు.

1.40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం : డీఎస్‌వో



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌వో వెంకటేశ్వర్‌రావు

శాలిగౌరారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను ముమ్మరంగా చేపడుతున్నామని, ఇప్పటి వరకు 1.40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం శాలిగౌరారం వ్యవసాయం మార్కెట్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 374ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని అందులో 266 కేంద్రాలను సన్నరకం ధాన్యం కొనుగోలుకు కేటాయించామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ఇప్పటి వరకు రూ.220కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డేటా ఎంట్రీ చేసి ఎప్పటికప్పుడు నగదును బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

అవగాహన, ఆత్మస్థైర్యమే లక్ష్యం



మారుతున్న ఆలోచనా విధానాలు, పెరుగుతున్న సోషల్ మీడియా ప్రభావంతో మహిళలపై అరాచకాలు పెరుగుతున్నాయి. మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు, నిత్యకృత్యమవుతున్నాయి. దీంతో సమాజంలో తమకు రక్షణ కరువైందనే భావన స్త్రీలలో పాతుకపోతున్నది. ఈనేపథ్యంలో విద్యార్థి దశనుంచే బాలికలను చెడు ప్రభావాల నుంచి అప్రమత్తం చేసే లక్ష్యంతో రాష్ట్ర విద్యా శాఖ బాలికా సాధికారత క్లబ్‌లకు శ్రీకారంచుట్టింది. ఈమేరకు ప్రతీ జిల్లాలో ఎంపిక చేసిన 100 ప్రభుత్వ పాఠశాలల్లో క్లబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రతీ కమిటీలో ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థినులతో కలిపి 12 మంది ఉంటారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

- ఉమ్మడి జిల్లాలో 300 ప్రభుత్వ పాఠశాలల్లో బాలికా సాధికారత కమిటీలు

ఉమ్మడి జిల్లాలో 300 బాలికా సాధికారత క్లబ్‌లు ఏర్పాటు కానుండగా 3600 మంది సభ్యులుగా ఉండనున్నారు. ప్రతినెలా కమిటీ సమావేశమై బాలికలు ఎదుర్కొన్న సమస్యలను చర్చించి పరిష్కరించడంతోపాటు బాలికా సాధికారతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పని నిమిత్తం బయటకు వెళ్లినా, బస్సులో ప్రయాణించినా, రద్దీ ప్రాంతాలు, చివరికి వివాహ తదితర శుభకార్యాలకు వెళ్లినా మహిళలకు లైంగిక వేధింపులు తప్పడం లేదు. భౌతికంగా తాకనప్పటికీ పలువురు పురుషులు మహిళలను వెగటుగా చూస్తూ తప్పుడు మాటలతో వేధిస్తుండటం పరిపాటిగా మారింది. ఏమాత్రం అవకాశం లభించినా మహిళల పట్ల బ్యాడ్ టచ్‌కు ప్రయత్నిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్న అంశం అయితే పురుషుల నుంచి ఎదురవుతున్న వేధింపులను ఎదుర్కొనడంలో మహిళకు కనీస అవగాహన, ఆత్మస్థైర్యం కొరవడటంతో ఆకతాయిలు విజృంభిస్తున్నారు.

బంధువులతోనే మహిళలకు వేధింపులు అధికంగా ఉంటున్నాయని ఓ సర్వే వెల్లడించింది. ఈ నేపథ్యంలో విద్యార్థి దశ నుంచే పురుషుల నుంచి ఎదురయ్యే వేధింపులు, ఆగడాలను ఎదుర్కొనే ఆత్మస్థైర్యం, చట్టాలపై బాలికా సాధికారత క్లబ్‌ల ద్వారా అవగాహన కల్పిస్తారు. అలాగే సైబర్ నేరాలు, ఆపత్కాలంలో ఆగడాలనుంచి తప్పించుకునే మార్గాలు, ఎదుర్కొన్న వేధింపులపై పోలీసులకు ఫిర్యాదుచేసే విధానం, సమాచారం ఇచ్చేందుకు అవసరమైన ఆత్మస్థైర్యంపై అవగాహన పెంపొందిస్తారు. బ్యాడ్ టచ్.. గుడ్ టచ్‌పై అవగాహన తరగతులు నిర్వహిస్తారు.

బాలికా సాధికారత కమిటీ ఇలా..

ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన 300 ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలో బాలికా సాధికారత క్లబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. కమిటీకి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఒక ఉపాధ్యాయుడు, ఒక మహిళా కానిస్టేబుల్, ఆ ప్రాంత షీటీం ఇన్‌చార్జి, ప్రతి తరగతి నుంచి ఇద్దరు చొప్పున విద్యార్థులు కమిటీలో ప్రాతినిధ్యం వహిస్తారు. పాఠశాల ఆవరణతోపాటు ఇతర ప్రాంతాల్లో ఎదుర్కొన్న వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు ప్రతీ పాఠశాల ఆవరణలో ఫిర్యాదు బాక్సులను ఏర్పాటుచేస్తారు. ప్రతీనెల జరిగే క్లబ్ సమావేశం రోజున ఫిర్యాదుల బాక్స్ తెరిచి ఫిర్యాదులను పరిశీలించి విచారణ చేపడతారు. ఇతర ప్రాంతాల్లో ఎదుర్కొన్న వేధింపులపై పోలీసులకు సమాచారం ఇస్తారు.

ఉమ్మడి జిల్లాలో

ఉమ్మడి జిల్లాలో గత కొన్నేళ్లుగా

మిగతా 7వ పేజీలో

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ, కొండమల్లేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో వసతి పొందుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం దేవరకొండ పట్టణంలో పలు గురుకుల పాఠశాలలను, కొండమల్లేపల్లిలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆమె తనిఖీచేశారు. దేవరకొండ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో స్టోర్ రూంను పరిశీలించి ఎలుకలు, బల్లులు రాకుండా శుభ్రంగా ఉంచాలని, ఎప్పటి స్టాక్ అప్పుడే వినియోగించాలన్నారు. గిరిజన బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి విద్యార్థినులతో కలిసి సాయంకాల అల్పాహారం తీసుకున్నారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. కొండమల్లేపల్లి సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. వంటగది, స్టోర్‌రూం, తరగతి గదులను పరిశీలించారు. వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేసి వాటి నిర్వహణ సరిగాలేకపోవడంపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ వస్తున్నారా అని ఆరాతీశారు. 15 రోజులపాటు పాఠశాలకు గుడ్లు సరఫరాలేకపోవడంపై ఇండెంట్ ఎందుకు పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరిత, కేర్‌టేకర్ కవితపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాళ్లు హనుమంతు అశోక్, కల్యాణి, కొండమల్లేపల్లి తహసీల్దార్ మహమ్మద్ అన్వర్ ఉన్నారు.



దేవరకొండలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

200 పడకల ఆస్పత్రి స్థలం పరిశీలన

శేరిపల్లి రోడ్డు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి వెనుకభాగంలో నూతనంగా 200 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి స్థలాన్ని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. అనంతరం డిగ్రీ కళాశాలలో సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని పరిశీలించారు. కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, తదితరులు ఉన్నారు.

స్ఫూర్తిని పెంపొందించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): ఈశా గ్రామోత్సవం ద్వారా జిల్లాలోని మహిళలు, వాలంటీర్లలో స్ఫూర్తిని పెంపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన గ్రామోత్సవంలో ఆమె మాట్లాడారు. జిల్లా నుంచి పాల్గొంటున్న క్రీడాకారులు బహుమతి తీసుకురావాలన్నారు. జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల అధికారి సీహెచ్.విష్ణుమూర్తి, జిల్లా పౌర సంబంధాల అధికారి వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రసాద్, ఏచూరి శైలజ, పాల్గొన్నారు.

30లోగా సర్వే వివరాలు నమోదు చేయాలి

సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఈనెల 30లోగా డేటా నమోదు పూర్తిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ప్రతీ 1,000 గృహాలకు నలుగురు ఆపరేటర్లను ఏర్పాటు చేశామన్నారు. వివరాల నమోదు ఆలస్యం కాకుండా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

డీఆర్డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో సంబరాలు

డిసెంబరు 9 వరకు కార్యక్రమాలు: డీఆర్డీవో వై.శేఖర్‌రెడ్డి

నల్లగొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన మొదటి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా డీఆర్డీవో, సెర్ప్ ఆధ్వర్యంలో తెలంగాణ సంబరాలు డిసెంబరు 9 వరకు నిర్వహించనున్నట్లు డీఆర్డీవో వై.శేఖర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని గ్రామీణాభివృద్ధి సంస్థలోని తాన ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11 నుంచి డిసెంబరు 9వరకు సెర్ప్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో సమభవన సంఘాల్లో చేరని మహిళలను 11,268 మందిగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వారందరినీ సంఘాల్లో చేర్పించేందుకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. ఈ క్రమంలో నూతన సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు, పొదుపు, రుణాలు, లాభాలపై అవగాహన కల్పిస్తామన్నారు. సంఘాల్లో చేరిన మహిళలకు నూతనంగా ప్రభుత్వం ప్రమాదబీమా, రుణబీమా అమలు చేయనున్నదన్నారు. ఇందిర మహిళా శక్తి కింద పాడిపశువులు, పెరటి కోళ్ల పెంపకానికి రుణాలు ఇవ్వనున్నట్లట తెలిపారు. అదే విధంగా మహిళా శక్తి క్యాంటీన్లను అన్ని పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెలలో కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. మొబైల్ ఫిష్ వాహనం గుండ్లపల్లి మండలానికి మంజూరైందన్నారు. అదే విధంగా డెయిరీఫామ్, ఆర్టీసీ అద్దె బస్సులకు రుణాలు ఇస్తాన్నారు. నాలుగు ఎకరాల భూమి ఉంటే సోలర్ విద్యుత్ ప్లాంట్ మంజూరు చేసి ప్రభుత్వం ఆ విద్యుత్ కొనుగోలు చేసేలా సహితం స్కీం వచ్చిందన్నారు. వీటన్నింటినీ డిసెంబరు 1న ప్రారంభిస్తామన్నారు. డీఆర్డీవో ఆధ్వర్యంలో మంజురైన పథకాలను ఈనెల 28న ప్రారంభిస్తామని తెలిపారు. 26న పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. అదే విధంగా డిసెంబరులో జిల్లా కేంద్రంలో ముగింపు ఉత్సవాలు ఉంటాయని తెలిపారు.



థర్మల్ పరిశ్రమకు త్వరలో ఆరు లేన్ల రహదారి

ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్

దామరచర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ పరిశ్రమకు త్వరలో ఆరు లేన్ల రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్ తెలిపారు. మండలంలోని యాదాద్రి విద్యుత్ పరిశ్రమకు వాహనాలు వెళ్లేందుకు ఆరు లేన్ల రహదారి నిర్మాణానికి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దామరచర్ల నుంచి పరిశ్రమ వరకు సుమారు 12కి.మీ దూరానికి రూ.236కోట్ల అంచనా వ్యయంతో నిధుల మంజూరుకు ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపారన్నారు. తాజాగా ఆ పలు ప్రాంతాలను పరిశీలించామన్నారు. ప్రజాప్రతినిధులతో చర్చించిన అనంతరం రహదారి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సీఈ వెంట డీఈఈ శ్రీనివాస్, రాంబాబు, గణేష్ తదితరులు ఉన్నారు.



కొత్త మురిపెం

- పాతవి పాడైతే ఇక అంతే సంగతులు
- మరమ్మతుల దుకాణాల వైపు చూడని ప్రజలు

నానాటికీ పెరుగుతున్న ఆధునిక పోకడలతో సామాన్యులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మారిన ఆహారపు అలవాట్లు, వస్తు సేవల వినియోగంలో మార్కెట్లో కొత్తగా వస్తున్న వాటికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. మరికొంత కాలం మన్నిక ఉంటుందని తెలిసినా, పాత వస్తువుల మరమ్మతుల జోలికే వెళ్లడం లేదు. ఫలితంగా అనవసరపు ఆర్థిక భారంపడుతున్నా కొత్త వస్తువులపై మోజు మాత్రం తగ్గడం లేదు.

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

6



నానాటికీ పెరిగిపోతున్న ఆధునిక పోకడలతో సామాన్యులు కొత్త రకం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మారిన ఆహారపు అలవాట్లు, వస్తు సేవల వినియోగం మార్కెట్లో ఆకర్షణీయమైన వస్తువులతో కొత్త సమస్యల్లో బందీలు అవుతున్నారు. ఫలితంగా కూలీ నుంచి రోజుకు రూ.వేలల్లో సంపాదించే వారు సైతం ప్రతి నిత్యం ఊహించని ఆందోళనకు గురవుతున్నారు. 'ఆదాయం రెండు.. అవసరాలు ఆరు' అన్న చందంగా మారడంతో అనుకున్న లక్ష్యం చేరుకోలేకపోతున్నారు. కొత్త వస్తువులపై మోజు సరికొత్త సమస్యలను తెచ్చిపెడుతోంది. "ఉదాహరణకు చెక్కతో చేసిన కుర్చీ మన్నిక ఎక్కువ. సుమారు 30-40 ఏళ్ల వరకు ఎలాంటి మరమ్మతులు అవసరం లేకుండా వాడుకోవచ్చు. అయితే మార్కెట్‌కు వెళితే తక్కువ ధర ఉన్న ప్లాస్టిక్ కుర్చీలు ఆకర్షిస్తుంటాయి. పర్యావరణానికి హాని కలిగించేవి అయినా, పదికాలాలు ఉండకపోయినా, వాతావరణానికి మంచిది కాదని తెలిసినా వాటినే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఏడాదికే అవి మూలనపడితే కొత్తగా కొనుగోలు చేయకతప్పడం లేదు. ఇదీ నేటి కాలమాన పరిస్థితి. అన్నీ కొత్తవే కొంటాం కానీ, వాటిని రిపేర్ చేయించేది లేదంటూ చాలామంది అంటున్నారు." - (ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

కొత్త మురిపెం

» పాతవి పాడైతే ఇక అంతే సంగతులు » మరమ్మతుల దుకాణాల వైపు చూడని ప్రజలు

మారుతున్న కాలానుగుణంగా అన్నీ కొత్తవే కొంటున్నారు తప్ప ఉన్న వస్తువులకు మరమ్మతు చేయించేందుకు ఆసక్తి చూపడం లేదు. పాతవి పడేసి.. కొత్తవి కొనుగోలు చేయడం నేడు పరిపాటిగా మారింది. మార్కెట్లోకి కొత్తకొత్త ఫీచర్లతో అనేక వస్తువులు ఆకర్షిస్తుండటంతో అందరూ వాటిపైనే మక్కువ చూపుతున్నారు.

ఇంద్రియాల గ్రామానికి చెందిన మైసయ్య దినసరి కూలీ. పొద్దంతా రెక్కలు ముక్కలు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంట్లో పాత టీవీ ఉంది. తీరిక సమయంలో కుటుంబసభ్యులతో కలిసి కాసేపు చూసి అప్పటివరకు పడిన శ్రమను మరిచిపోతారు. ఇటీవల ఆ టీవీ పాడైంది. స్థానికంగా మరమ్మతులు చేసేవారు లేరు. భూదాన్‌పోచంపల్లికి తీసుకెళితే కొత్తది కొనుక్కోవాలంటూ సలహా ఇచ్చారు. మరోవైపు పిల్లలు టీవీ కోసం పక్కింటికి వెళ్తున్నారు. తప్పని పరిస్థితిలో ఎలాగోలా కొత్త టీవీ కొనాలని నిర్ణయించుకున్నాడు. రూ.500 నుంచి రూ.1000 వరకు ఖర్చు చేస్తే పాత టీవీని మరికొన్నాళ్లు ఉపయోగించుకునే అవకాశం ఉన్నా రూ.20 వేలు పెట్టి కొత్త టీవీ కొనుగోలు చేయాల్సి వచ్చింది.



వాహనంలో తరలిస్తున్న పాత వస్తువులు

నెలకే.. సెల్‌ఫోన్ మార్చేస్తున్నారు

ఇటీవల సెల్‌ఫోన్ల వినియోగం విపరీతంగా పెరిగింది. మొదట్లో అంతా సాధారణ ఫోన్లు వినియోగించేవారు. అప్పట్లో ఎన్నోఇబ్బందులు పడి ఫోన్ కొనుక్కున్న తర్వాత టచ్ ఫోన్లు మార్కెట్లను ముంచెత్తాయి. ఇప్పుడు 2జీ నుంచి 4జీకి మారుతున్నారు. ప్రస్తుతం 4జీ నుండి 5జీ వాడేస్తున్నారు. కాలానుగుణంగా మార్పు సహజమే అయినా వేగవంతమైన మార్పుతో సామాన్యులు సమిధలవుతున్నారు. రోజూ కొత్త మోడల్ మార్కెట్‌లోకి రావడంతో మంచి ఫోన్ అంటూ కొనుగోలు చేసేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో అన్ని ఫీచర్లు ఉన్న ఫోన్ కొనుగోలు చేయాలంటే రూ.6వేల నుంచి రూ.15 వేల ఖర్చు చేయక తప్పని పరిస్థితి. వ్యవసాయ కూలీలు నిత్యం రూ.300 నుంచి రూ.350 వరకు సంపాదిస్తున్నారు. ప్రస్తుత నగదురహిత లావాదేవీలు ఎక్కువ కావడం, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు తమ యాప్‌లు ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహిస్తుండటంతో ప్రతి ఒక్కరికీ స్మార్ట్ ఫోన్ తప్పనిసరే అనే భావన కలుగుతోంది. ఫలితంగా డబ్బులు ఉన్నా లేకున్నా చాలామంది కొత్త ఫోన్ కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. అదేవిధంగా టీవీలు, ఫ్యాన్లు, వాషింగ్ మెషీన్లు, మిక్సీలు, గడియారాలు, వాచ్‌లు, కంటి అద్దాలు, ఇంటి అలంకరణ వస్తువులు, సోఫాలు తదితర వస్తువులు అన్నీ కొత్తవే కొనుగోలు చేస్తున్నారు. పాతవాటికి స్వస్తి పలుకుతున్నారు. వాటిని రిపేరింగ్ చేసి వాడుదామనే ఆలోచన ఎవరికీ రావడం లేదు. ఆదాయం ఇంటి అవసరాలకు చాలడం లేదని అందరూ ఆవేదన చెందుతున్నారు.

లేటెస్ట్‌గా.. సెల్‌ఫోన్లు తెగ కొనుగోలు

ఆధునిక సాంకేతికతతో మార్కెట్లోకి కొత్తకొత్త ఫీచర్లతో స్మార్ట్‌ఫోన్లు వచ్చేస్తున్నాయి. స్మార్ట్ ఫోన్, టచ్ ఫోన్ల వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. ప్రస్తుతం చాలామంది పిల్లలు, యువత సెల్‌ఫోన్, ల్యాప్ టాప్, టీవీలకు తెగ అలవాటుపడుతున్నారు.



వీటిలో సెల్‌ఫోన్ వాడకం ఎక్కువైంది. చాలామందికి ఇదో వ్యసనమైంది. ఒకప్పుడు 2జీ ఫోన్లు వాడిన వారు మారుతున్న కాలానుగుణంగా సాంకేతికత అందిపుచ్చుకుంటున్న తరుణంలో 4జీ వాడుతుండగా ఇప్పుడు 4 జీ నుంచి ఏకంగా 5జీ వాడేస్తున్నారు. అయితే ఫోన్లలో వివిధ బ్రాండ్ కంపెనీలు వివిధ మోడల్స్‌తో మార్కెట్‌లోకి తెస్తుండటంతో యూత్ లేటెస్ట్ అప్‌డేటెడ్ ఫోన్లపై మోజు పడుతున్నారు. కొందరు పాత ఫోన్లు ఉన్నా.. కొత్త ఫోన్లు కొనేస్తున్నారు. మరికొందరు తమ స్టేటస్ సింబల్ కోసం యాపిల్ ఫోన్ వాడేస్తున్నారు. అనేక ఫీచర్లతో పాటు అన్ని యాప్‌లకు అవకాశం ఉండే యాపిల్ ఫోన్ల వినియోగం నేటి తరానికి స్టేటస్ సింబల్‌గా మారింది. దీనికి తోడు చేతి గడియారాలు సైతం యాపిల్ వాచ్, ఐవాచ్‌లు అనేకంగా మార్కెట్లకు వచ్చేశాయి. వీటి వినియోగం కూడా విపరీతంగా పెరిగింది. అది కూడా తమ హోదాను పెంచేస్తోందని భావిస్తూ చాలామంది వాడుతున్నారు. అయితే పాతవాటిని పక్కన పెట్టి ఎప్పటికప్పుడు మార్కెట్‌లోకి కొత్తగా ప్రవేశించే ఆధునిక టెక్నాలజీ ఉన్న ఫోన్లు తదితర వస్తువులు వినియోగించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఉన్నవాడు (ధనికులకు) ఇబ్బంది పడేది లేదు, కానీ, సామాన్యులు, మధ్యతరగతి వారికి ఆర్థికభారం అవుతోంది. కొందరు పక్కవాడికి యాపిల్ ఫోన్ ఉందని, తానుకూడా కొనుక్కోవాలని ఆసక్తి చూపుతున్నారు. దీంతో వీటి వినియోగం ఎక్కువైంది. అయితే ఇలాంటి వస్తువులు అతి సున్నితంగా వాడాల్సి ఉంది. పొరపాటున చేజారి కింద పడిందా.. ఇక అంతే సంగతులు. అసలు మరమ్మతులు ఉండవు. ఉన్నా కొత్త ఫోన్‌కొనేంతగా ఉంటాయి. దీంతో అనవసర ఖర్చుల జమాలో కలుస్తోంది. అందుకే అందరూ కొత్తగా.. కొంగొత్తగా వస్తువులను కొనాలని ఆసక్తి చూపుతున్నారు.

గమనిస్తే తప్ప మోసాలు తెలియడం లేదు



ఇటీవల మార్కెట్లో కనిపించని మోసాలు ఎక్కువయ్యాయి. మిక్సీ, ఫ్యాన్ల మోటార్లకు పైన కాపర్ పూత పూసి వస్తున్నాయి. వాటికి మరమ్మతులు చేస్తే ఖర్చు తప్ప పెద్దగా ప్రయోజనం ఉండదు. అదే పాత పద్ధతిలో తయారుచేసిన మోటార్లు అయితే రీవైండింగ్ చేయవచ్చు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో అడుగడుగునా మోసాలతో సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇలాంటి లోపాలు షోరూంలో గుర్తించలేం. గుర్తించినా పాత రకం వస్తువు దొరకని పరిస్థితి. దీంతో లోపాలున్నా అవే కొనాల్సి వస్తోంది.

- మధుసూదన్, మెకానిక్, భూదాన్‌పోచంపల్లి

జీవనం భారంగా మారింది



మొదట్లో కిరోసిన్ స్టవ్‌లు, తర్వాత గ్యాస్‌స్టవ్‌లు, రైసు కుక్కర్లు, ఇతర వస్తు సామగ్రి మరమ్మతులు చేస్తూ ఉపాధి పొందేవాడిని. వచ్చిన ఆదాయం కుటుంబానికి ఆసరాగా ఉండేది. నేటి తరం ఎవరూ మరమ్మతులు చేసిన వస్తువులు వాడేందుకు ఇష్టపడటం లేదు. మార్కెట్లో కొత్త ఆఫర్లు రావడంతో పాతది పడేసి కొత్తది కొనేస్తున్నారు. దీంతో మరమ్మతుల దుకాణాలు మూతపడుతున్నాయి. జీవనం దుర్భరంగా మారుతోంది.

- శ్రీనివాస్, మెకానిక్, భూదాన్‌పోచంపల్లి

భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, పరిసర ప్రాంతాల్లోని మరో పది గ్రామాల్లో 100 మందితో నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి' సర్వే వివరాలు.


1) మీ ప్రాంతంలో నిపుణులైన ఎలక్ట్రానిక్ పనివారు ఉన్నారా?




2) టీవీ/ఫోన్/ఫ్యాన్/ఏదైనా పని చేయకపోతే బాగు చేయిస్తారా? లేదా కొత్తవి కొంటారా?



3) మీకు వెంటనే అవసరం లేకున్నా కొత్తవి ఎలక్ట్రానిక్ వస్తువులు కొంటున్నారా?



4) పాత వస్తువు/యంత్రం వాడే అవకాశం ఉన్నా ఎందుకు మార్చాల్సి వస్తోంది?



ఆధునిక ఫీచర్లు: 18
అందరూ కొంటున్నారని: 52
అత్యవసరం కావడంతో: 30

5) కొత్త వస్తువులు కొనుగోలు చేయడం ఆర్థిక భారం అవుతుందా?





పెద్దరావులపల్లికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి నెల వేతనం రూ. 60వేలు. ఇటీవల బ్యాంకులో రుణం తీసుకుని నూతనంగా ఇల్లు నిర్మించుకున్నారు. ఆయన ఇప్పటికే ఉపయోగిస్తున్న కారు, బైకు పదేళ్ల పాటు వాడే అవకాశం ఉంది. అయినా అప్పుచేసి ఓ బైక్, కారు కొన్నారు. ఇప్పుడు ఆయన వేతనంలో నెలకు రూ.35 వేలు వరకు ఈఎంఐ రూపంలో చెల్లిస్తున్నారు. కుటుంబ పోషణ, వాహనాల్లో పెట్రోలు, ఇతర ఖర్చులకు డబ్బులు చాలడం లేదని వాపోతున్నారు.

తంగెడుపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు ఇంట్లో ఓ ఫ్యాన్ పాడైంది. బాగుచేయించడానికి దుకాణానికి నాలుగు సార్లు తిరగాలంటూ వెంటనే కొత్తది కొనేశాడు. పాతదాన్ని మూలకు పడేశాడు.




సైకిళ్ల రిపేరింగ్ దుకాణాలు కనుమరుగు

సైకిళ్ల రిపేరింగ్ చేసే దుకాణాలు కనుమరుగవుతున్నాయి. ప్రస్తుతం సైకిళ్లు వాడేవారు తగ్గిపోయారు. అడపాదడపా ఎవరైనా పాతవి తీసుకొచ్చి బాగు చేయమంటే విడిభాగాలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. నగరానికి వెళ్లి వాటిని తీసుకురావాలంటే రవాణా చార్జీలు చాలా అవుతున్నాయి. దీంతో మరమ్మతుల దుకాణాలు మూతపడుతున్నాయి. అంతేగాక వాచ్ రిపేరింగ్ దుకాణాలు, ఫ్యాన్ రిపేర్ దుకాణాలు కనిపించడం లేదు.

నిపుణుల కొరత మరో సమస్య

ఒకప్పుడు ప్రతి గ్రామంలో ఇద్దరు, ముగ్గురు ఎలక్ట్రానిక్ యంత్రాలు మరమ్మతులు చేసేవారు ఉండేవారు. వృత్తి విద్యాకోర్సులు చదివిన ఎంతో మందికి ఎలక్ట్రానిక్ వస్తువుల మరమ్మతుల దుకాణాలు ఉపాధిని చూపేవి. కాలక్రమేణా వీరి జాడే లేకుండా పోయింది. అక్కడక్కడా ఒక్కరిద్దరు ఉన్నా మార్కెట్లో లభించే రెడీమేడ్ పరికరాలు తీసుకువచ్చి బిగించడానికే పరిమితమవుతున్నారు. ఈ పరిస్థితి ఆర్థికంగా ఉన్నవారికి పెద్దగా ఇబ్బంది ఉండదు కానీ, సామాన్యులు, మధ్య తరగతి కుటుంబీకులకు తలకు మించిన భారంగా పరిణమిస్తోంది.



మండలవ్యాప్తంగా పలు ఉన్నతపాఠశాలలో గతంలో ఇచ్చిన కంప్యూటర్లు ఉన్నాయి. ట్రైనర్స్ లేకపోవడంతో అవి మరమ్మతులకు గురయ్యాయి. నిపుణులైన పనివారు బాగు చేస్తే వినియోగించుకునే అవకాశం ఉంది. ఖర్చు తక్కువ అవుతుంది. అయితే ఉపాధ్యాయులు పాత కంప్యూటర్లు బాగు చేసే వారు ఎవరూ లేరని వాటిని మూలకు చేర్చారు. ప్రభుత్వం మళ్లీ నిధులు విడుదల చేసి కొత్తవి ఇస్తుందిలే అని ఎదురు చూస్తున్నారు.

యాదగిరిగుట్టపై భక్తుల సందడి



నిత్య కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పెద్దగుట్టపై వైటీడీఏ అతిథి గృహం

భువనగిరి అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఆలయం శనివారం సందడిగా మారింది. కార్తీక మాసం, వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పార్కింగ్ ప్రదేశం, మూడో ఘాట్ చౌరస్తా, వాహన పూజల వద్ద, పార్కింగ్ ప్రదేశం వాహనాలతో నిండిపోయింది. సుమారు 32వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రూ.150ల ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక దర్శనాలకు గంట, ఉచిత దర్శనాలకు మూడు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రధానాలయం, కల్యాణోత్సవ మండపం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాల వద్ద కూడా భక్తులతో రద్దీ నెలకొనగా ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. భక్తులను కొండపైకి తరలించేందుకు తగినన్ని బస్సులు ఏర్పాటు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 42,98,152 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా 959 జంటలు సత్యదేవుని వ్రతాల్లో పాల్గొన్నాయి. సంగీతసభల్లో భాగంగా అభినయ రుద్ర నాట్యాలయం, నృత్యాంజలి డాన్స్ అకాడమీ రజనీ భరతనాట్యం భక్తులు ఆకట్టుకున్నాయి.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకారమండపంలో హోమం, నిత్యకల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్ట స్వామి అమ్మవారికి నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్యపూజలు జరిపారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యర్, హైకోర్టు న్యాయమూర్తి సృజన కుటుంబ సమేతంగా వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి వారికి లడ్డు ప్రసాదం అందజేశారు.

వైటీడీఏ అతిథి గృహానికి మోక్షం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్ర సందర్శనకు వీవీఐపీ తాకిడి పెరిగింది. ఇందుకోసం ప్రెసిడెన్షియల్ సూట్స్ అందుబాటులో ఉండగా వైటీడీఏ అతిథి గృహం శుక్రవారం తలుపులు తెరుచుకున్నాయి. ఇప్పటివరకు నిరుపయోగంగా ఉండగా ప్రస్తుతం అందులో బస చేసేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. క్షేత్రానికి అభిముఖంగా పెద్దగుట్టపై 2019లో ఈ భవనాన్ని నిర్మించారు. క్షేత్ర సందర్శనకు వచ్చిన దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యర్ ఆ అతిథి భవనంలో శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో బసచేశారు. వైటీడీఏకు కేటాయించిన భవనాన్ని స్వాధీనం దేవస్థానం చేసుకుంటున్న తరుణంలో తొలిసారి ప్రిన్సిపల్ సెక్రెటరీ స్థాయి అధికారి కుటుంబ సభ్యులతో నిద్రించడం ప్రాధాన్యం సంతరించుకుంది. శనివారం ఉదయం స్వామిఅమ్మవారలను దర్శించుకున్నారు.

వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది



అభివాదం చేస్తున్న మంత్రి రాజనర్సింహ, మాదిగ కుల, ఉపకులాల నాయకులు, ఏపూరి సోమన్న ఆటపాట

నల్లగొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుపై సుప్రీంకోర్టు తీరు అమలుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. అందులో భాగంగా వన్‌మెన్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 77 ఏళ్ల స్వతంత్ర దేశంలో దళితుల రిజర్వేషన్ల వర్గీకరణపై ఆందోళన సాగుతోందని గుర్తుచేశారు. వర్గీకరణ అనేది జనాభా ప్రకారం మాదిగ, మాదిగ ఉపకులాలకు రావాల్సిన హక్కు అన్నారు. ఇది ఎవరికీ వ్యతిరేకం కాదని, రాజ్యాంగం కల్పించిన హక్కులో భాగమన్నారు. వర్గీకరణపై 2004లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా న్యాయవాదిని ఏర్పాటుచేసి వాదనలు వినిపించాలని తనను కోరగానే సుప్రీంకోర్టుకు వెళ్లామన్నారు. తమ వాదనలు విన్న సుప్రీంకోర్టు వర్గీకరణను రాష్ట్రాలే చేసుకోవచ్చని తీర్పును ఇచ్చిందన్నారు. తీర్పు వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. వన్ మెన్ కమిటీ నివేదిక ఆధారంగానే ప్రభుత్వం స్పందించి వర్గీకరణను అమలు చేస్తుందన్నారు. వర్గీకరణను వ్యతిరేకిస్తున్న వారు కూడా తమ సోదరులే అని, సోదరభావంతో కలిసిమెలిసి జనాభాప్రకారం రిజర్వేషన్ల ఫలాలను పంచుకునేందుకు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ, మాదిగ జాతి సంక్షేమం కోసం ఐక్యంగా వర్గీకరణ అమలు చేయించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ, వర్గీకరణ ఉద్యమంలో 12 మంది అమరులయ్యారని, వారి స్ఫూర్తితో వర్గీకరణను, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను పొందాలన్నారు. వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చే విధంగా మాదిగ ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ, వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలలకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులపై పార్టీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభాధ్యక్షత వహించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీలోని మాదిగ ప్రజాప్రతినిధులంతా దాని అమలు కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమ్మేళనంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు కాంపల్లి సత్తయ్య, కాలె యాదయ్య, పిడమర్తి రవి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, కొండేటి మల్లయ్య, నాగారం అంజయ్య, బొర్ర సుధాకర్, శ్రీనివాస్, మల్లేష్, శ్రీరాములు, దున్న యాదగిరి, పున్నా కైలాష్ పాల్గొన్నారు. ఏపూరి సోమన్న, చుక్క నర్సయ్య ఆట పాటలు సభికులను అలరించాయి.

రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

తుంగతుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఐకేపీ కేంద్రాల్లో నాణ్యతా పరిశీలకులు ఎంపిక చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లుకు పంపాక మిల్లర్ ధాన్యం బాలేదని కొర్రీలు పెడుతూ బస్తాకు కిలో, రెండు కిలోలు కోతపెట్టి రైతులను నిలువునా ముంచుతున్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలోని అన్నారం ఐకేపీ కేంద్రంలో నాణ్యతా ప్రమాణాలతో కొనుగోలు చేసి ఎగుమతి చేసిన ధాన్యాన్ని కోదాడ రైస్ మిల్లర్ దిగుమతి చేసుకోకుండా తిరిగి ఐకేపీ కేంద్రానికి తిప్పిపంపడంతో రైతు దంపతులు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం... తుంగతుర్తి మండలంలోని చౌళ్ల తండాకు చెందిన గుగులోతు భీమా దంపతులు అన్నారం గ్రామానికి చెందిన గోగుల రామకృష్ణ భూమిని కౌలుకు తీసుకుని వరి సాగుచేశారు. అందులో పండించిన ధాన్యాన్ని ఈ నెల మొదటి వారంలో అన్నారం ఐకేపీ కేంద్రంలో పోశారు. ఆరబెట్టి, తూర్పారబట్టాక ఏఈవో ధాన్యం తేమ శాతాన్ని, నాణ్యతను పరిశీలించి కొనుగోలుకు ఎంపిక చేశారు. ఆ ధాన్యాన్ని ఈ నెల 16న కాంటా వేశారు. భీమాకు చెందిన 425 బస్తాలతో పాటు మరో ఇద్దరు రైతులవి 263 బస్తాలు కలిపి మొత్తం 688 బస్తాలు ఈ నెల 17న



రైతు భీమాతో మాట్లాడుతున్న తుంగతుర్తి తహసీల్దార్ దయానందం, మిల్లు నుంచి తిరిగి వచ్చిన ధాన్యం లారీ

లారీలో ఎగుమతి చేసి కోదాడలోని వెంకటరమణ రైస్‌మిల్లుకు ఎగుమతి చేశారు. మిల్లు నిర్వాహకులు ఈ నెల 18న ధాన్యం నల్లగా ఉందంటూ దించుకోకుండా ఐకేపీ కేంద్రానికి సమాచారమిచ్చారు. దీంతో రైతు భీమా, ఐకేపీ నిర్వాహకులు మిల్లుకు వెళ్లి అడగ్గా ధాన్యం బాగా లేదని బస్తాకు మూడు కిలోలు తరుగు తీస్తామని మిల్లు నిర్వాహకులు చెప్పారు. అందుకు రైతు భీమా అంగీకరించకుండా తరుగు తీయకుండా దించుకోవాలని బతిమిలాడినా మిల్లు నిర్వాహకుడు ఒప్పుకోలేదు. తరుగుతీస్తే తాను ఒప్పుకునేది లేదని రైతు తిరిగి వచ్చాడు. మిల్లు నిర్వాహకులు ఆ ధాన్యం దించుకోకుండా శనివారం ఉదయం తిరిగి ఐకేపీ కేంద్రానికి పంపించారు. ఐకేపీ నిర్వాహకులు ధాన్యం లారీ తిరిగి వచ్చిందని చెప్పడంతో రైతు భీమా దంపతులు ధాన్యం కొనుగోలు కేంద్రంలోని లారీ వద్దకు వెళ్లి ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించారు. ఒంటిపై పెట్రోలు పోసుకుంటుండగా కేంద్రంలో ఉన్న తోటి రైతులు చూసి వారి చేతిలోని పెట్రోల్ డబ్బాను లాగేశారు. విషయాన్ని స్థానిక తహసీల్దార్ దయానందంకు తెలిపారు. వెంటనే తహసీల్దార్, డీటీ కంఠమయ్య, ఏవో బాలకృష్ణ, ఏపీఎం రాంబాబు ఐకేపీ కేంద్రానికి చేరుకున్నారు. రైతును వివరాలు అడిగి తెలుసుకున్నారు. విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా మిల్లు యజమానితో మాట్లాడి తరుగు లేకుండా దించుకుకోవాలని తిరిగి మిల్లుకు పంపారు. ఆ మిల్లుకు వెళ్లిన ధాన్యానికి బస్తాకు ఒక కిలో చొప్పున కోత విధిస్తున్నారని చెబుతున్నారు.

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం వర్గీకరణ చేపట్టాలి

నల్లగొండటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు మార్గదర్శకాలను పాటించి వర్గీకరణ చేపట్టాలని బెల్లంపల్లి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు జి.వినోద్, కేఆర్.నాగరాజు స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబరు 1వ తేదీన హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలల సింహగర్జన సభకు సన్నాహకంగా శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడారు. మాలల సింహగర్జన బహిరంగ సభ ఎవ్వరికీ వ్యతిరేకం కాదని, మాలల అస్థిత్వం, ఆత్మగౌరవం కోసం ఐక్యం చేసేందుకే సభ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 30 లక్షల మంది మాలలు ఈ సభకు తరలివచ్చి హైదరాబాద్ నగరాన్ని నీలిమయంగా మార్చాలని పిలుపునిచ్చారు. మాలలపై ఏ పార్టీ కుట్ర చేసినా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ జి.చెన్నయ్య, కోచైర్మన్లు తాళ్లపల్లి రవి, మేక వెంకన్న, బూర్గుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హైదరాబాద్ చేపట్టిన సభకు మాలలు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణపై బీజేపీ కుట్రను తిప్పికొట్టాలని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్



అభివాదం చేస్తున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే జి.వినోద్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

కుట్ర చేసి మాలలపై కొంతమంది మాదిగ నాయకులతో విషం కక్కిస్తోందని ఆరోపించారు. దాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని భాస్కర్ టాకీస్ వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఓపెన్ టాప్ జీపులో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మన్ లకుమల్ల మధుబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమ్మేళనంలో నాయకులు మంత్రి నర్సింహయ్య, చెన్నకేశవులు, నాను, గాజుల పున్నమ్మ, చింతపల్లి బాలకృష్ణ, అద్దంకి రవీందర్, సంద యాదగిరి, నామ చక్రవర్తి, అంగారాజు స్వర్ణలత, గీత, తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన మాల సంఘం నాయకులు

ఆవిష్కరణల సిపాయి

▸ 10 రకాల టెక్నాలజీలను రూపొందించిన హుజూర్‌నగర్ యువకుడు
▸ రైతులు, మహిళల కోసం ప్రత్యేక టెక్నాలజీ ▸ వీడియోకాలింగ్ టెక్నాలజీతో చోరీలకు చెక్

ఆవిష్కరణ : యాక్సిడెంట్ ఈ-కాల్ టెక్నాలజీ



తయారీకి పట్టిన సమయం : రెండు నెలలు
తయారీకి ఖర్చు: రూ.40 వేలు
ఉపయోగం : యాక్సిడెంట్ సమయంలో మనం ఎంచుకున్న వారి ఫోన్ నెంబర్లకు సమాచారం వెళ్తుంది.

ఆవిష్కరణ : కరెంట్ షాక్ టెక్నాలజీ



తయారీకి పట్టిన సమయం : 45 రోజులు
తయారీకి ఖర్చు:రూ.50 వేలు
ఉపయోగం : రైతులకు ఎంతో ఉపయోగం. పొలాల వద్ద విద్యుదాఘాతాల నుంచి రైతులను కాపాడుతుంది. ఈ టెక్నాలజీని ఉపయోగిస్తే విద్యుత్ షాక్ సమయంలో విద్యుదాఘాతం సమయంలో సరఫరా నిలిచిపోతుంది.

ఆవిష్కరణ : యాంటీరేప్ గర్ల్స్ సేఫ్టీ టెక్నాలజీ

తయారీకి పట్టిన సమయం : 40 రోజులు
తయారీకి ఖర్చు : రూ.30 వేలు
ఉపయోగం : మహిళలకు ఆకతాయిలు, దుండగుల నుంచి ఏదైనా సమస్య వస్తే వాయిస్‌కమాండ్ ద్వారా సమాచారాన్ని కుటుంబ సభ్యులు, లేదా పోలీసులకు అందించవచ్చు.

ఆవిష్కరణ : సీసీ టీవీ, వీడియోకాలింగ్ టెక్నాలజీ

తయారీకి పట్టిన సమయం : నాలుగు నెలలు
తయారీకి ఖర్చు : రూ.60 వేలు
ఉపయోగం : ఈ టెక్నాలజీని ఇళ్లు, వ్యాపార కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలి. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా రాత్రి వేళ అక్కడ సంచరిస్తే ఆటోమేటిక్‌గా మనం టెక్నాలజీకి ఇచ్చిన ఐదు ఫోన్ నెంబర్లకు వీడియోకాలింగ్ వెళుతుంది. దీంతో అప్రమత్తం కావచ్చు. చోరీలు, దాడులు జరుగకుండా జాగ్రత్త పడవచ్చు. ఈ రోజుల్లో ఇలాంటి పరికరం ఎంతో అవసరం.



టెక్నాలజీ పరికరాలతో సిపాయినాయక్

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన బాణోతు సిపాయినాయక్ వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు పేదరికం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు. నిరుపేద గిరిజన కుటుంబంలో పుట్టిన సిపాయినాయక్ టెక్నాలజీ రంగంలో సరికొత్త ప్రయోగాలు చేస్తూ యువ టెక్నాలజిస్ట్ పేరుగాంచాడు. 23 ఏళ్ల బాణోత్ సిపాయి నాయక్‌కు 10వ తరగతి నుంచే ప్రయోగాలు చేయడమంటే ఇష్టం. ఇప్పటివరకు ప్రజలు, రైతులకు ఉపయోగపడేలా సరికొత్త 10 రకాల టెక్నాలజీలను ఆవిష్కరించాడు.

- (ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

బాణోతు సిపాయినాయక్ తన తండ్రి పంతుల్యాను చిన్నతనంలో కోల్పోయాడు. అతడికి తల్లి లక్ష్మి, అక్క శైలజ ఉన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత ఏడాది బీఏ పూర్తిచేసిన సిపాయినాయక్ స్థానిక రామస్వామి గట్టు వద్ద ప్రభుత్వ స్థలంలో చిన్న రేకుల ఇంట్లో తల్లితో కలిసి జీవిస్తున్నాడు. తల్లి మేకలు కాస్తూ కుమారుడు సిపాయిని పోషిస్తోంది. అంతేకాకుండా అతడి టెక్నాలజీ ప్రయోగాలకు అవసరమైన డబ్బు అందిస్తోంది. తల్లి లక్ష్మి ప్రతిరోజూ ఆమెకున్న 20 మేకలు కాస్తుండగా అప్పుడప్పుడు సిపాయి కూడా తల్లితో పాటు మేకలు కాసేందుకు వెళ్తుంటాడు.

చిన్నతనంతోనే ఆవిష్కరణల బాట

సిపాయినాయక్ స్థానిక ఎన్ఎస్‌పీ క్యాంప్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నప్పుడే నూతన ఆవిష్కరణలు చేశాడు. రిమోట్ ద్వారా విద్యుత్ బల్బులు ఆన్, ఆఫ్ చేసే టెక్నాలజీని, చార్జింగ్ ద్వారా మోటార్ సైకిల్ నడిచేలా టెక్నాలజీని రూపొందించారు. ఆయన ఆవిష్కరణలు రోజు వారి జీవితంలో ఎంతగానో సహాయపడతాయి.

తల్లి, దాతల సహకారంతో

సిపాయినాయక్ తాను కనుగొన్న పరికరాలకు మేథోసంపతి(పేటెంట్) హక్కులు సాధించారు. ముఖ్యంగా సిపాయినాయక్ యాక్సిడెంట్ టెక్నాలజీ, స్పెట్స్ మోషన్ టెక్నాలజీ, గ్రావిటీ ఐప్యాడ్ టెక్నాలజీ, సీసీటీవీ వీడియోకాల్ టెక్నాలజీలకు పేటెంట్ హక్కులు సాధించడం గమనార్హం. వీటి తయారీకి బెంగుళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి మెటీరియల్ తెప్పించారు. ఒక్కో టెక్నాలజీ పేటెంట్ కోసం సుమారు రూ60వేలు ఖర్చు చేశారు.

ఇందుకోసం అమ్మతో పాటు పట్టణంలోని అనేకమంది దాతలు ఆర్థికంగా సహకరించినట్లు తెలిపారు. టెక్నాలజీ తయారీకి ఎంతో శ్రమించానని, పేటెంట్ వచ్చినప్పటికీ ఇంకా దానిపై అనేక పరిశోధనలు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త టెక్నాలజీని కనుక్కోవడం, పాత టెక్నాలజీని డెవలప్‌చేయడం వంటి ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. టెక్నాలజీ డెవలప్‌చేసే క్రమంలో హైదరాబాద్‌కు చెందిన రియల్‌ఎస్టేట్ యజమాని, ఆర్యవైశ్య సంఘం నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, క్యాప్‌డెక్ కంపెనీ ప్రతినిధులు ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు.

మరికొన్ని ఆవిష్కరణలు

సిపాయినాయక్ ఫైర్‌యాక్సిడెంట్ ఈకాల్ టెక్నాలజీ, స్పెట్స్ మోషన్ టెక్నాలజీ, గ్రావిటీ ఐప్యాడ్ టెక్నాలజీ, ఐకీ ఫొటో క్యాప్చరింగ్, సిగ్నల్ బ్రేక్‌త్రూ, వీడియో క్యాప్చరింగ్ టెక్నాలజీ, డార్క్ కమ్యూనికేషన్, డిజిటల్ డివైస్ ఆపరేటింగ్ టెక్నాలజీ, థండర్ స్ట్రోక్ టెక్నాలజీ ఆవిష్కరించారు.

టీహబ్‌కు ప్రయత్నించి...

సిపాయినాయక్ గతంలో టీ-హబ్ ద్వారా కొన్ని ప్రయోగాలు చేసేందుకు ప్రయత్నించారు. టీహబ్ ఇన్‌చార్జి, ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను కలిసి టీహబ్‌లో తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఎవరి సహకారం లేకపోవడంతో టీహబ్ అవకాశం చేజారిపోయింది. నూతన ఆవిష్కరణలకు టీహబ్ వేదికగా నిలుస్తుందని ఆశించినా ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో సొంతంగా కొత్త ఆవిష్కరణలు చేస్తున్నారు. తన ప్రయోగాలకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు.



చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.125	200	230
సూర్యాపేట	రూ.120	180	200
నల్లగొండ	రూ.132	194	214

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	585.10
టీఎంసీలు	297.7235
ఎడమకాల్వకు నీటి విడుదల	4,949
కుడికాల్వకు	10,040
విద్యుత్ కేంద్రం ద్వారా	29,069
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	31,315
అవుట్‌ఫ్లో	46,758 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.45 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	2 వేల క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	00

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.50 అడుగులు
టీఎంసీలు	4.33
కాల్వలకు	24.43 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	315.97 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	68.91 క్యూసెక్కులు

సదర్శాపురంలో పంపకాల 'పంచాయితీ'

● మూడు రోజులు ఆగిన తండ్రి అంత్యక్రియలు ● భూమి పంపకాలు చేస్తేనే అంత్యక్రియలను అడ్డుకున్న కుమారుడు

మోత్కూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెరిగిన భూముల ధరలు కుటుంబాల్లో చిచ్చు రేపుతున్నాయి. ఏళ్ల తరబడి పరిష్కారం కాని భూపంచాయితీలను సంబంధీకులు మృతి చెందినప్పుడు అంత్యక్రియలు జరగకుండా అడ్డుకుంటున్నారు. ఈ సమయం తప్పితే తమకు రావాల్సి ఆస్తి రాదని అనుబంధాలను కూడా పక్కన పెడుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని సదర్శాపురం గ్రామంలో ఇలాంటి ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. సోదరుడితో ఉన్న భూతగాదాను పరిష్కరించుకోవడానికి ఓ కుమారుడు తన తండ్రి భౌతికకాయానికి అంత్యక్రియలు జరగకుండా మూడు రోజులు ఆపాడు. గ్రామస్థుల కథనం ప్రకారం... సదర్శాపురం గ్రామానికి చెందిన ఆలకుంట్ల బాలయ్య, లింగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు నరేష్ తాటిపాముల గ్రామానికి చెందిన మేనత్త కుమార్తెను వివాహం చేసుకున్నాడు. అయితే బాలయ్య పెద్ద కోడలు గ్రామం అయిన తాటిపాములలో భూమిని కొనుగోలు చేసి పెద్ద కోడలు పేరునే పట్టా చేయించాడు. ఈ భూమిలో చిన్న కుమారుడు సురేష్‌కు ఎలాంటి భాగం ఇవ్వలేదు. బాలయ్య తనకు సదర్శాపురం గ్రామంలో ఉన్న భూములను ఇద్దరు కుమారులకు పంచాడు. తాటిపాముల గ్రామంలో ఉన్న ఒక ఎకరం పది గుంటల భూమిలో సురేష్‌కు ఇవ్వాల్సిన వాటా ఇవ్వకుండా పెద్ద కుమారుడు నరేష్, అతని భార్య తగదా పడుతున్నారు. తల్లిదండ్రులు, పెద్ద మనుషులు చెప్పినా వారు వినలేదు. ఈ తగాదా రెండు, మూడేళ్లుగా నడుస్తోంది. ఈ నెల 21న సాయంత్రం బాలయ్య(65) అనారోగ్యంతో మృతిచెందాడు. 22న అంత్యక్రియలు నిర్వహించడానికి యత్నించగా భూమిలో తనకు రావాల్సిన వాటా ఇస్తానని కాగితం రాసిస్తేనే తండ్రికి నరేష్‌ను తలకొరిపి పెట్టనిస్తానని, అంతవరకు అంత్యక్రియలు జరగనివ్వనని చిన్న కుమారుడు సురేష్, అతని భార్య అడ్డుకున్నారు. తండ్రి ఆస్తిలో అతనికి వాటా ఎందుకు ఇవ్వరని పెద్దకుమారుడిని, అతని భార్యను గ్రామస్థులు నిలదీయడంతో ఇస్తామని శుక్రవారం సాయంత్రం అంగీకరించారు. అప్పటికే పొద్దుపోవడంతో శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించడానికి భూమిలో వాటా ఇస్తానని కాగితం రాసి ఇవ్వాలని చిన్న కుమారుడు సురేష్ కోరగా, వారు మళ్లీ తిరగబడ్డారు. మూడు రోజులవుతున్నా అంత్యక్రియలు నిర్వహించకుండా అలానే ఉంచడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, మోత్కూరు ఎస్ఐ డి.నాగరాజు వెళ్లి ఇరువర్గాలను కూర్చోబెట్టి మాట్లాడారు. ఎట్టకేలకు పెద్దకుమారుడు నరేష్ తనకు ఎక్కువగా ఉన్న భూమిని పంచి ఇచ్చేలా ఒప్పందం కుదిర్చి కాగితాలు రాయించారు. శనివారం సాయంత్రం తండ్రి బాలయ్య భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.



అంత్యక్రియలు జరగక ఫ్రీజర్‌లో ఉన్న బాలయ్య భౌతికకాయం



పీడీఎస్ బియ్యం అక్రమార్కులపై పటిష్ట నిఘా

- వేర్వేరు కేసుల్లో ఇరువురి అరెస్ట్
- పీడీఎస్ రైస్ వ్యాపారం చేసే ఇరువురిపై రౌడీ షీట్ నమోదు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి అక్రమార్కులను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. రెండు వేర్వేరు కేసుల్లో పీడీఎస్ బియ్యం వ్యాపారం చేసే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశం లో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. గత నెల అక్టోబరు 24న 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న ఏపీ 39 యూఎఫ్ 8418 నెంబరు గల అశోక్‌లేలాండ్ మినీగూడ్స్ వాహనం అదుపు తప్పి దామరచర్ల మండలం నర్సాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద బోల్తాపడి అందులో ప్రయాణిస్తున్న కూలీ షేక్ నాగూర్‌వలీ అక్కడికక్కడే మృతిచెందాడు. వాహనం డ్రైవర్ అమరయ్యపై కేసు నమోదు చేసి విచారించగా పీడీఎస్ రైస్ వ్యాపారం చేసే మందపాటి నరసింహరావు, కల్లూరి లింగయ్య, హమాలీ ముఠా మేస్త్రీ సైదారావు, రేషన్‌కార్డుదారుల నుంచి కేజీ బియ్యాన్ని రూ.10 కొనుగోలు చేసి దాచేపల్లికి చెందిన పీడీఎస్ బియ్యం వ్యాపారులకు అమ్ముతున్న బండావత్ తండాకు చెందిన బండావత్ సర్దార్‌ల ప్రమేయం ఉన్నట్లు తెలిసిందని అన్నారు. వీరిలో ముగ్గురిని ఈ నెల 19వ తేదీన అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా పరారీలో ఉన్న సర్దార్‌ను శనివారం వాడపల్లి వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అతనిపై గతంలో దామరచర్ల పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు నమోదైనట్లు డీఎస్పీ వివరించారు.

ఇరువురిపై రౌడీషీట్

ఇదే కేసులో మూడు రోజుల క్రితం అరెస్ట్ జైల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ జిల్లా పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన మందపాటి నర్సింహారావుపై 2015 నుంచి 15 కేసులు, అదే గ్రామానికి చెందిన కల్లూరి లింగయ్యపై 11 కేసులు నమోదైనట్లు చెప్పారు. నల్లగొండ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వీరి ఇరువురిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు చెప్పారు. రౌడీ షీట్ కేసును పల్నాడు జిల్లాకు బదిలీ చేయాలా.. ఇక్కడే కొనసాగించాలా అనే విషయమై ఉన్నతాధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

● మరో వ్యాపారి అరెస్ట్

వాడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పీడీఎస్ బియ్యం వ్యాపారం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కారంపూడి మండలం కొదమగుండ్ల మండలానికి చెందిన పల్లపు కామేశ్వర్‌రావును శనివారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఏపీ 30 డబ్ల్యూ 9526నెంబర్ అశోక్ లేల్యాండ్ వాహనంలో 13క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గతంలో అతనిపై సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌లో స్క్రాప్ దొంగతనం కేసు, నాగార్జునసాగర్, హాలియా పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారం కేసులు నమోదైనట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ వీరబాబు, వాడపల్లి ఎస్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

గుడిసె ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఆదివాసి ఎరుకల కుటుంబానికి చెందిన కుతాటి ప్రేమలత, యాదగిరి గుడిసెను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూతాడి సురేష్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. అనంతరం గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ధ్వంసమైన గుడిసెను పరిశీలించారు. ఎక్స్‌కేవేటర్‌తో గుడిసె తొలగించారని ఆరోపించారు. అనంతరం కలెక్టర్ హనుమంతరావును కలిసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, నిం దితులను అరెస్టు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, ఉద్యోగుల సంఘ ం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ సదానందం, నాయకులు కూతాడి రవికుమార్, వనం రమేష్, కోనేటి నర్సింహ, కుతాడి సురేష్, యాదగిరి, మహేష్, శ్రీనివాస్, బూషన్న, నర్సింహ, యాదగిరి, బందనపురం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలని అఖిలపక్షం ధర్నా

పిలాయిపల్లి రంగనాథ స్వామి దేవాలయం భూమిని ఆక్రమించడానికి యత్నించడంతోపాటు అక్రమంగా నివాసముంటున్న కుతాటి యాదగిరి గ్రామంలోని కొందరు వ్యక్తులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ రంగనాథస్వామి దేవాలయానికి రామచంద్రం అనే వ్యక్తి భూమిని జాతర కోసం వాడుకోవడానికి స్థానికంగా ఉన్న యాదగిరి తనకు స్థలం లేకపోవడంతో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకున్నాడని,

ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు స్థలంలో ఏర్పాటు చేసుకున్న గుడిసెలను తొలగింపు విషయాన్ని గత నెలలో యాదగిరికి చెప్పామని అన్నారు. అయితే యాదగిరి గుడి స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించాడని ఈ విషయంపై అతన్ని కలిసి విషయాన్ని తెలిపామన్నారు. అన్ని పక్షాల నాయకులు వెళ్లి చెప్పినా వినిపించుకోక పోవడంతో ఎట్టకేలకు తామె ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తుండగా గ్రామస్థులపై అక్రమంగా కేసు పెట్టాడన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు మాజీ ఎంపీటీసీ బందారపు సుమలత లక్ష్మణ్‌గౌడ్, మాజీ ఉపసర్పంచు పడాల సతీష్‌చారి, నాయకులు తోట శ్రీనివాస్, తోట బాబు, భూషణ్‌గౌడ్, మధు, సందీప్‌రెడ్డి, కొంతం శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన, ఆత్మస్థైర్యమే లక్ష్యం

(5వ పేజీ తరువాయి..)

హాస్టళ్లు, పాఠశాలల్లో బాలికలపై పలు బ్యాడ్ టచ్ సంఘటనలు వెలుగు చూశాయి. ఈ ఉదంతాలలో ఐదుగురు బాలికలు ఆత్మహత్య చేసుకున్నారు. భువనగిరిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై దేశంలోనే మొట్టమొదటిగా పోక్సో కేసు నమోదు కాగా, ప్రస్తుతం ఆ నిందితుడు జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. అలాగే భువనగిరి పరిధిలోని జడ్పీహెచ్ఎస్ రాయిగిరి బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ కిరాణదుకాణం యజమానిపై కూడా పోక్సో కేసు నమోదైంది. భువనగిరి బాల సదనంలో కూడా ఇలాంటి ఘటనే ఇటీవలె వెలుగు చూసిన విషయం విధితమే. అయితే బహిర్గతంకాని దాష్టీకాలు లెక్కకు మించి ఉంటున్నాయని సామాజిక కార్యకర్తలు పేర్కొంటున్నారు. అయితే బాలికా సాధికారిత కమిటీలను ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ఏర్పాటు చేయాలని పలువురు అంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే ప్రైవేట్ పాఠశాలల్లోనే బాలికలు అధిక వేధింపులకు గురవుతున్నారని, కానీ యాజమాన్యాల వైఖరితో వెలుగు చూడటం లేదంటున్నారు.

త్వరలోనే కమిటీల ఏర్పాటు

బాలికల భద్రతా, అవగాహన లక్ష్యంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో త్వరలోనే బాలికా సాధికారత కమిటీలను ఏర్పాటు చేయనున్నాం. ఈ మేరకు కమిటీలు ఏర్పాటు చేయనున్న వంద పాఠశాలలను గుర్తించాం. ఇందుకోసం త్వరలోనే సంబంధిత శాఖలతో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించనున్నాం. కమిటీల ఏర్పాటుతో బాలికల్లో చైతన్యం పెరిగి వారి భావి జీవితం భద్రంగా ఉండనుంది.

సత్యనారాయణ, డీఈవో, యాదాద్రి భువనగిరి జిల్లా

ఎంజీయూలో వివిధ శాఖలకు అధికారుల నియామకం

నల్లగొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పలువురికి స్థానచలనం కల్పించి కొత్త వారికి బాధ్యతలు అ ప్పగిస్తూ ఉపకులపతి ఆచార్య అల్తాఫ్ హుస్సేన్ ఆదేశాలు జారీ చేశారు. మౌలిక వసతుల డైరెక్టర్‌గా ఆకుల రవి స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్‌గా శ్రీదేవి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌గా అన్నపూ ర్ణ, ఆర్ఎస్ బుట్టి, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా తిరుమల, యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కో ఆర్డినేటర్‌గా చింత శ్యాంసుందర్‌లను నియమించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఆయుధాల కేసులో ముగ్గురు వ్యక్తుల అరెస్ట్?

సూర్యాపేటక్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తుపాకులు తరలిస్తున్న కేసులో సూర్యాపేట జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులను ఆదిలాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బీహార్ నుంచి తుపాకులు కొనుగోలు చేసి రాష్ట్రానికి వస్తున్న క్రమంలో జనశక్తి సానుభూతిపరులతో పాటు వారిని ఉసికొల్పిన మరో ఇద్దరు వ్యక్తులను శుక్రవారం ఆదిలాబాద్ పోలీసులు అరెస్ట్ చేశా రు. ఈ కేసులో తాజాగా ఆదిలాబాద్ పోలీసులు సూర్యాపేటలో మరో ముగ్గురిని పోలీసులు అదుపులో తీసుకున్నట్టు తెలిసింది. వీరిలో గతంలో హత్యకు గురైన సూర్యాపేట జిల్లాకు చెందిన ఎల్లయ్యకు సంబంధించిన వారు కాగా, అందులో ఓ మహిళ కూడా ఉన్నట్లు సమాచారం. సూర్యాపేట జిల్లా నాగారం మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డె ఎల్లయ్య, తాడూరి శ్రీకాంత్‌రాజ్ కొన్నాళ్ల పాటు జనశక్తి ఉద్యమంలో పని చేశారు. తర్వాత ఇద్దరు ఉద్యమాన్ని విడి సాధారణ జీవనం గడుపుతున్నారు. ఎల్లయ్య అత్తగారు ఊరు సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామం కావడంతో అక్కడే నివాసం ఉంటున్నాడు. శ్రీకాంత్ రాజ్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా, కొద్దిరోజుల క్రితం వివిధ వివాదాల నేపథ్యంలో ఎల్లయ్య, శ్రీకాంత్ రాజ్‌కు మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఎల్లయ్యను పథకం ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ 18న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేటలో దారుణంగా హత్య చేసి భూమిలో పాతి పెట్టారు. నెల రోజుల తరువాత మృతదేహం లభించింది. ఈ కేసుకు సంబంధించి శ్రీకాంత్‌రాజ్ ప్రధాన నిందితుడిగా పోలీసులు నిర్ధారించి అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించారు. కాగా ఎల్లయ్యకు జనశక్తిలో పనిచేసిన సమయంలో ఏపీ రాష్ట్రం శ్రీశైలం సమీపంలో సున్నిపెంటకు చెందిన వెంకటరెడ్డితో పరిచయం ఏర్పడింది. అయితే తన స్నేహితుడైన ఎల్లయ్యను హత్య చేసినందుకు శ్రీకాంత్‌రాజును చంపి ప్రతీకారం తీర్చుకోవాలని అదే ప్రాంతానికి చెందిన మరో ఇద్దరికి తెలిపి తుపాకి కొనుగోలు తీసుకురావాలని పంపా డు. దీంతో పాటు నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, బీఆర్ఎస్ నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్‌తో కూడా వెంకటరెడ్డికి పరిచయం ఉంది. ఈ క్రమంలో ఇద్దరు కలిసి వారి పథకాన్ని అమలు చేసేందుకు తుపాకులు కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అందులో భాగంగా వెంకటరెడ్డి తన వద్ద ఉన్న ఇద్దరు వ్యక్తులను బీహార్‌కు పంపి తుపాకులు కొనుగోలు చేయించి తీసుకుని వస్తూ పోలీసులకు పట్టుబడ్డారు.

కుట్ర భగ్నం

వడ్డె ఎల్లయ్య హత్యకు పాల్పడిన వారిని హత్య చేయడంతో పాటు మరో రెండు హత్యలు చేసేందుకు నిందితులు పథకం పన్నినట్టు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఓ టీడీపీ నాయకుడితో పాటు తెలంగాణలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసే మరో వ్యక్తిని హత్య చేసేందుకు ముఠా ఒప్పందం చేసుకున్నట్టు సమాచారం. ఈ హత్యలతో పాటు భూవివాదాలు, ఇతర సెటిల్‌మెంట్లు కూడా చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా సంబంధిత వ్యక్తుల నుంచి ముందస్తుగా కొంతమొత్తంలో డబ్బు కూడా తీసుకున్నట్లు వినికిడి. ప్రస్తుతం పోలీసులు కేసును లోతుగా విచారణ చేస్తున్నారు. విచారణలో మరిన్ని విషయాలు తేలనున్నాయి. కాగా, తుపాకుల కొనుగోలు అంశం సూర్యాపేటలో చర్చానీయాంశంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

చిట్యాలరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్ర మాదం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో శనివారం జరిగింది. చిట్యాల ఎస్ఐ ధర్మ తెలిపిన వివరాల ప్రకారం... గుండ్రాంపల్లి శివారులో గుర్తు తెలియని వ్యక్తి పెట్రోల్ బంకు ఎదురుగా రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి చిట్యాల వైపునకు వచ్చే స్కోడా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి తలకు తీవ్రగాయాలై అక్కడికక్క డే మృతి చెందాడు. సమాచారం తెలుసుకుని చి ట్యాల పోలీసులు మృతదేహానికి పంచనామా చే సి యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని ప్ర భుత్వ ఆసుపత్రికి తరలించారు. గుండ్రాంపల్లి పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

నకిరేకల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నెల్లిబండ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ లచ్చిరెడ్డి, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నెల్లిబండ గ్రామానికి చెందిన యానాల ప్రభాకర్‌రెడ్డి (52) శుక్రవారం తన ద్విచక్ర వాహనంపై నకిరేకల్‌కు వచ్చి నిత్యావసర సరుకులు తీసుకుని తిరిగి గ్రామానికి వెళ్తున్నాడు. నెల్లిబండ గ్రామ సమీపంలో ఎదురుగా అజాగ్రత్తగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆయన్ను నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపా రు. మృతుడు ప్రభాకర్‌రెడ్డి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

హైదరాబాద్ మ్యూజియంలో సూర్యకుమార్‌కు సన్మానం

నకిరేకల్, నవంబరు 23,(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న హెరిటేజ్ వారోత్సవాల సందర్భంగా 'తెలంగాణ శాసనాలు ఒక పరిశీలన' అనే అంశంపై వ్యాసనోపన్యాసం ఇచ్చిన నకిరేకల్‌కు చెందిన పురావస్తు శాఖకు చెందిన డాక్టర్ డి. సూర్యకుమార్‌ను శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మ్యూజియంలో డిప్యూటీ డైరెక్టర్లు సన్మానించారు. శిలాశాసనాల ఎస్టాంప్‌పేజీ తీసే విధానంపై ప్రాక్టికల్ డిమాన్‌స్ట్రేషన్‌ను సూర్యకుమార్ చూపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ రాములునాయక్, నారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

మీడియా సమాజానికి అద్దం లాంటింది : కలెక్టర్

నల్లగొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మీడియా సమాజానికి అద్దంలాంటిందని కలెక్టర్ ఇలా త్రిపాఠీ అన్నారు. శనివారం పట్టణంలో ప్రెస్‌క్లబ్ ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, జర్నలిస్టుల ఇంటి స్థలాల విషయం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టిలో ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో వెంకటేశ్వర్లు, క్లబ్ గౌరవ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లోనే దేశ భవిష్యత్తు

తిప్పర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశ భవిషత్తు పాఠశాలల్లోనే ఉందని మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. తిప్పర్తి ఎంఈవోగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన అరుంధతిని మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిషత్తు మార్చేది ఒక్క ఉపాధ్యాయులు మాత్రమేనని కొనియాడారు. ఉపాధ్యాయుడు పాఠశాలల అభివృద్ధికి, వాటి బలోపేతానికి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదాయంలో రెండోస్థానం...

- ప్రగతిపథంలో దేవరకొండ ఆర్టీసీ డిపో
- నల్లగొండ రీజియన్‌లోనే ఉత్తమ డిపో అవార్డు
- సమష్టి కృషితోనే కృషితోనే ఫలితాలు : డీఎం



దేవరకొండ బస్ డిపో

దేవరకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గతంలో వెనుకంజలో ఉన్న దేవరకొండ ఆర్టీసీ డిపో ఆదాయంలో నల్లగొండ రీజనల్‌లోనే రెండోస్థానంలో నిలిచింది. దేవరకొండ డిపోలో 110 బస్సులకుగాను 103 బస్సులు నడుస్తున్నాయి. ప్రతీరోజు 42 వేల నుంచి 43 వేల కిలోమీటర్ల వరకు బస్సులు నడుస్తున్నాయి. డిపోలో డీఎం, అసిస్టెంట్ డీఎంతో పాటు 391 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. దేవరకొండ ఆర్టీసీ డిపోకు ఈ నెల 20వ తేదీన నల్లగొండలో రీజినల్ పరిధిలో ప్రతీ మూడు నెలలకు ఒకసారి జరిగే త్రైమాసిక ప్రగతిచక్ర అవార్డులను దేవరకొండ డిపోకు ఏడు అవార్డులు వచ్చాయి. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఏడుగురు ఉద్యోగులు రీజనల్ మేనేజర్ రాజశేఖర్ అందజేశారు. ప్రశంసాపత్రాలతో పాటు 750 నగదు బహుమతులను అందుకున్నారు. ఆదాయంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ సేవలు అందించిన టీం డ్రైవర్లు వీవీ రెడ్డి, బురానుద్దీన్, ఎల్లయ్య, ఎల్.నగేష్, అమరేష్, మెకానిక్ శ్రీనివాస్ అవార్డులు అందుకోగా వీవీ రెడ్డికి రెండు అవార్డులు అందజేశారు. దసరాకు దేవరకొండ డిపో నుంచి 45, 533 కిలోమీటర్లు బస్సులను నడిపి 47.83 లక్షల ఆదాయాన్ని తీసుకువచ్చి రాష్ట్రస్థాయిలోనే ప్రథమస్థానంలో నిలిచింది దేవరకొండ డిపో. దీంతో పాటు ఓఆర్‌లో సైతం రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేయడం వల్లే దేవరకొండ డిపో లాభాల బాటలో పయనిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. మరింత ఉత్సాహంతో పనిచేసి దేవరకొండ డిపోకు రాష్ట్రస్థాయిలోనే గుర్తింపు తీసుకురావాలని ఉన్నత అధికారులు ఉద్యోగులను కోరుతున్నారు. దేవరకొండ డిపో నుంచి అత్యధికంగా బస్సులు హైదరాబాద్‌కు నడుస్తున్నాయి. ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు హైదరాబాద్‌కు నడుస్తుంది. హైదరాబాద్‌తో పాటు నల్లగొండ, మిర్యాలగూడతో పాటు అన్ని ప్రధాన పట్టణాలు, గ్రామాలకు బస్సులను నడిపిస్తున్నారు. తిరుపతి పుణ్యక్షేత్రానికి సైతం దేవరకొండ నుంచి బస్సును నడుపుతున్నారు.

ఉద్యోగుల కృషి, ప్రయాణికుల సహకారం



దేవరకొండ డిపోలో ఉద్యోగులు, అధికారులు సమష్టి కృషితో పనిచేస్తున్నారు. ప్రయాణికుల సూచనలు, సలహాలు తీసుకొని బస్సులు నడుపుతున్నాం. అందరి సమష్టి కృషి, ప్రయాణికుల సహకారంతోనే లాభాల బాటలో ముందుకు వెళుతున్నాం.

● సైదులుయాదవ్, డిపో అసిస్టెంట్ మేనేజర్

అన్నంపెట్టే ఆర్టీసీని నమ్ముకొని పనిచేస్తున్నా



అన్నంపెట్టే ఆర్టీసీని నమ్ముకొని క్రమశిక్షణతో పనిచేస్తున్నా. బస్సులో కండక్టర్ లేకపోయినా టిక్కెట్ కొట్టి ప్రయాణికుల సూచనల మేరకు చెయ్యి ఎత్తిన చోట బస్సును ఆపి తీసుకెళ్తున్నాను. ఉన్నతాధికారులు తనను ప్రోత్సహించి ప్రగతిచక్ర అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉంది.

● వీవీరెడ్డి, డ్రైవర్

డిపో ఆదాయం పెంచేందుకు ప్రయత్నం



ప్రయాణికుల కోరిక మేరకు ఆర్టీసీ బస్సులు నడపుతున్నాం. జాతరలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. దేవరకొండ బస్టాండ్‌కు రీజనల్ పరిధిలోనే బెస్ట్ అవార్డు వచ్చింది. బస్టాండ్‌లో సౌకర్యాలు, వసతులు కల్పించినందుకు ఉన్నతాధికారులు అవార్డును అందజేశారు.

● రమేష్‌బాబు, ఆర్టీసీ డీఎం, దేవరకొండ

సమాచారం

పంపిణీకి వరి విత్తనాలు సిద్ధం

కనగల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కనగల్ పీఏసీఎస్ కార్యాలయంలో వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పీఏసీఎస్ అధికారి రాంచంద్రారెడ్డి తెలిపారు. వివిధ రకాల వరి విత్తనాలతో పాటు జింక్, యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాలనుకునే రైతులు తమ పట్టా పుస్తకం జీరాక్స్‌ను వెంట తీసుకుని సోమవారం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మెగా వైద్యశిబిరం రేపు

డిండి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ దేవరకొండ ఆధ్వర్యంలో డిండి మండల కేంద్రంలో ఈ నెల 25వ తేదీన ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తిప్పర్తి రుక్మారెడ్డి, రాముచౌహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యశోద హస్పిటల్ హైదరాబాద్ వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 23: సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ యూసుఫ్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాలతో పాటు మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాల, విజేత డిగ్రీ కళాశాలలో డేటా ఎంట్రీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టణ పరిధిలో 33603 ఆవాసాలు ఉండగా, 140 మంది కంప్యూటర్ ఆపరేటర్లతో సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

చింతపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రమాకాంత్‌శర్మ అన్నారు. శనివారం మండలంలోని వేంకటేశ్వర, శివసాయి కాటన్ మిల్లుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత రైతులు తెచ్చిన పత్తిని మోసం చేయకుండా పారదర్శకంగా విక్రయించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎవరైనా రైతులను మోసం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టై, బెల్ట్, యూనిఫాం అందజేత

పెద్దవూర, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగతుర్తి మండల పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు జానపాటి కృష్ణయ్యయాదవ్ జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు జానపాటి సతీష్‌యాదవ్ శనివారం ఉచితంగా టై, బెల్టులు, ఐడీ కార్డులు, ఒక జత స్పోర్ట్స్ యూనిఫాంను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో రాము మాట్లాడుతూ విద్యార్థులు దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లారెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణ, జానపాటి సాంబయ్య, జానపాటి ముత్యాలు, నడ్డి నరేష్, సాంబయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమగ్ర కులగణన సర్వే చరిత్రాత్మకం

మునుగోడురూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగనణ సర్వే చరిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీ కులగణన సర్వేలో తన స్వగ్రామం కోతులారం గ్రామంలో శనివారం కులగణన నమోదు చేసుకున్న ఆయన మాట్లాడారు. సమగ్ర కులగణన జరిగి బీసీల లెక్కలు తేల్చాలని, మూడు దశాబ్దాలుగా చేసిన బీసీల పోరాటం రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేతో ఫలప్రదమైందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాజుల సత్యనారాయణగౌడ్, నాయకులు జాజుల భాస్కర్, కందుల లింగస్వామి, జాజుల వెంకటేష్, యాదగిరి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

అడవిదేవులపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రజాపాలన ప్రజా విజయోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంతోపాటు మండలంలోని ఉల్సాయిపాలెం, బాల్నెపల్లి గ్రామాల్లో శనివారం సాంస్కృతిక సారథి కళాబృందం ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగహన కల్పించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, గృహలక్ష్మి, రైతు భరోసా, రైతు రుణమాఫీ, యువతకు ఉద్యోగ అవకాశాలు వంటి వాటిపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో మోసినుద్దీన్, ఆర్ఐ శ్యామ్‌సుందర్, పంచాయతీ కార్యదర్శులు చింతల శ్రీను, ప్రవీణ్‌కుమార్, మూర్తి, గ్రామస్థులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటం'

నకిరేకల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన వారి సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాళ ప్రమీల అన్నారు. నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెంలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మిర్యాలగూడలో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న సీపీఎంకు ప్రజలు మద్దతివ్వాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వంటెపాక వెంకటేశ్వర్లు, నాయకులు సీహెచ్ నాగమణి, వంటెపాక కృష్ణ, బి.ఇందిర, స్వరూప, సుంకి మణెమ్మ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై సమగ్రే సర్వే



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

దామరచర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వాడపల్లిలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై రెవెన్యూ, ఫారెస్ట్, మైనింగ్ శాఖల ఆధ్వర్యంలో సమగ్ర సర్వే నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు మైనింగ్ శాఖ ఆర్ఐ ఆనంద్ తెలిపారు. శనివారం మండలంలోని వాడపల్లి పరిధిలోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి వెంట ఉన్న ఓ పరిశ్రమ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతుందని రైతులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వాడపల్లిలో స్థానిక పరిశ్రమకు ప్రభుత్వం కేటాయించిన భూములు ఎన్ని ఎకరాలు అందులో ఫారెస్ట్, దేవాదాయ భూములపై మూడు శాఖల ఆధ్వర్యంలో డిజిటల్ సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం తుది నివేదికను ఉన్నతాధికారులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనింగ్ ఆర్ఐ రవికుమార్, మైనింగ్ సర్వేయర్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ ఇందిర, రైతులు దారగాని సురేష్, డి.వెంకటేశ్వర్లు, రాంరెడ్డి, బుజ్జి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, బుజ్జి, మాదర్‌ఖాన్, అద్దల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వల్లాలలో మహాపడి పూజ రేపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ధర్మకర్త రామలింగయ్య శర్మ

శాలిగౌరారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లాల గ్రామంలోని పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 25 వ తేదీన మహాపడి పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మహాపడి పూజ పోస్టర్లను గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాలధరుడు భూపతి ఉపేందర్‌గౌడ్ మాట్లాడుతూ మహాపడి పూజ కార్యక్రమానికి మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వావిలాల రామలింగయ్యశర్మ, శివ మాలధారులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో చేతకాని, చేవలేని ప్రభుత్వం'

నార్కట్‌పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో చేతకాని, చేవలేని ప్రభుత్వం నడుస్తుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నార్కట్‌పల్లిలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్ మాయమాటలు నమ్మి ఓటేసి గెలిపించనందుకు ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారని ఆవేనద వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని కేవలం 1.70 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మిగతా ధాన్యాన్ని రైతులు మిల్లర్లకు, దళారులకు విక్రయించి నష్టపోతున్నారని అన్నారు. ఏం సాధించారని ప్రభుత్వం ప్రజా విజయోత్సవాలు చేపడుతుందో ప్రజలకు కూడా అర్థం కావడం లేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, నాయకులు యానాల అశోక్‌రెడ్డి, మేకల రాజిరెడ్డి, వెంకటయ్య కొండూరు శంకరయ్య, వాజిద్, శ్రీధర్, నర్సింహ, ఉపేందర్, సైదులు, నాగరాజు, జాని పాల్గొన్నారు.

'లగచర్ల ఘటనకు కేటిఆరే కారకుడు'

మిర్యాలగూడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆరే కారకుడని గిరిజన శక్తి జిల్లా అధ్యక్షుడు లింగానాయక్ ఆరోపించారు. పట్టణంలో శనివారం నిర్వహించిన గిరిజన శక్తి ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా కంపెనీల కోసం ప్రభుత్వం సేకరించే భూముల్లో 190 ఎకరాలు మాత్రమే గిరిజన రైతులవని అన్నారు. మిగతా భూములు ఇతర కులాలకు చెందిన వారివని పేర్కొన్నారు. అమాయక గిరిజనులను బలిపశువులను చేశారని విమర్శించారు. ఘటనలో అసలు సూత్రధారులను తెరపైకి తెచ్చి కఠినంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో నాయకులు కృష్ణనాయక్, మల్సూర్ నాయక్, సురేష్ నాయక్, శివనాయక్ పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేములపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన కొక్కు రాము, గంగు సతీష్‌రెడ్డి, లక్ష్మీదేవిగూడెం గ్రామానికి చెందిన చింతకాయల భిక్షం, మిర్యాలగూడ మండలం దొండవారిగూడెం గ్రామానికి చెందిన వీరమళ్ల శ్రీధర్‌లు తమ ట్రాక్టర్లతో రావులపెంట గ్రామ శివారులోని మూసీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా శనివారం తెల్లవారుజామున శెట్టిపాలెం గ్రామశివారులో పట్టుకున్నామన్నారు. ఈ మేరకు కొక్కు రాము, భిక్షం, శ్రీధర్‌లతో పాటు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన పోలీసులు



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

నార్కట్‌పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడి ఇంటి నుంచి పారిపోయి వచ్చి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పిన మహిళను 100 కాల్ ద్వారా నార్కట్‌పల్లి పోలీసులు కాపాడారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆమనగల్లుకు చెందిన ఓ మహిళ తన భర్తతో గొడవపడి శుక్రవారం రాత్రి చెర్వుగట్టుకు వచ్చింది. తాను చెర్వుగట్టుకు వచ్చానని, చనిపోతున్నానని తన కోసం వెతకవద్దని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. వారు వెంటనే 100 కాల్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన నార్కట్‌పల్లి హెడ్ కానిస్టేబుల్ భూతరాజు రమేష్, హోంగార్డు రమేష్‌లు వెంటనే చెర్వుగట్టు గుట్టపైకి చేరుకున్నారు. అప్పటికే వాట్సాప్ ద్వారా సదరు మహిళ ఫొటోను తెప్పించుకుని ఆమె వద్ద ఉన్న ఫోన్ నెంబర్‌ను లొకేషన్ ట్రాక్ చేసి పట్టుకున్నారు. అనంతరం ఆమెను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. తమ సోదరిని కాపాడి అప్పగించినందుకు బాధిత మహిళ సోదరుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

మూసీ ప్రక్షాళనతోనే ప్రజలకు మనుగడ

- ఎమ్మెల్యే వేముల వీరేశం



మూసీ రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి, నకిరేకల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మూసీ నది ప్రక్షాళన జరిగితేనే నదీ పరివాహక ప్రాం తాల్లో మానవమనుగడ సాధ్యమవుతుంద ని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. జిల్లా లో నాగార్జునసాగర్ త ర్వాత రెండో పెద్ద ప్రాజెక్టు అయిన మూసీలో దాదాపు 9 లక్షల ఉచిత చేప పిల్లలను ఆయన శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేపల మీద ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న చేపపిల్లలు వరంలాంటిదని అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మత్స్యకారులకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చేందుకు ప్రభు త్వం మూడు రకాల చేప పిల్లలను అందించిందని అన్నారు. గతంలో దోసిలితో తాగిన చరిత్ర గల మూసీ నీళ్ల ప్రస్తుతం విషతుల్యమై పోయాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మూ సీ ప్రాంత ప్రజల జీవన విధానంలో మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మూసీ నీటిలో ఉన్న సూపర్ బగ్ బ్యాక్టీరియా పరివాహక ప్రాంత ప్రజల మనుగడను ప్రశ్నార్థకం చేస్తుందన్నారు. మూసీ ప్రక్షాళనతో నీటిలో ఉన్న సూ పర్ బగ్ బాక్టీరియా నశించి ప్రజల జీవనశైలి మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో కాసనగోడు, ఇనుపాముల మాజీ ఎంపీటీసీలు కందుల మోహన్, పి.ఇందిర, బి.సుందర్, పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్.కేశయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, నాయకులు ఎం.వెంకట్రాంరెడ్డి, శెట్టి మణి, డి.రాములు, వెంకన్న, కీర్తి వెంకన్న, వెంకటేశ్వర్‌రావు, వెంకటనారాయణ, వెంకటస్వామి, సాదుల నరసయ్య, కొరివి యాదగిరి, లక్ష్మీనారాయణ, యాదగిరి, సైదులు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ రావడం ఖాయం



నల్లగొండలో మిఠాయిలు తినిపిస్తున్న బీజేపీ నాయకులు

రామగిరి, నార్కట్‌పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో బీజేపీ గెలుపును హర్షిస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలందరూ వ్యతిరేకంగా ఉన్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అందరికీ న్యా యం జరగాలంటే బీజేపీ అధికారంలోకి వస్తేనే జరుగుతుందని నమ్మడం వల్లే హర్యానా ప్రజలు బీజేపీని గెలిపించారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బండారు ప్రసాద్, పిల్లి రామరాజుయాదవ్, వీరెల్లి చంద్రశేఖర్, పోతేపాక సాంబయ్య, పెరికె మునికుమార్, ఫకీర్, మోహన్‌రెడ్డి, నెవర్స్ నీరజ, రావెళ్ల కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో మహారాష్ట్రలో బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంపై బీజేపీ నేతలు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొర్వి శంకర్, మునుకుంట్ల గణేష్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, మేడబోయిన శ్రీనివాస్, రామలింగం, నాగరాజు, మహేష్, నర్సింహ, శివ, అంజి, రమేష్, తిరుమలేష్, నవీన్, నీలం శివరాం, స్వామి, శివ, నాగరాజు పాల్గొన్నారు.

మోదీ పథకాలతోనే గెలుపు : చొక్కారావు

నల్లగొండ: మహారాష్ట్ర ప్రజలు ఉచిత పథకాలకు ఆశ పడకుండా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను చూసి పార్టీని గెలిపించారని బీజేపీ రాష్ట్ర నాయకుడు పొనుగోటి చొక్కారావు అన్నారు. మహారాష్ట్రలో బీజేపీ కూటమిని గెలిపించడంపై రాష్ట్ర ప్రజలను అభినందించారు. ప్రజలు కష్టపడి శ్రమించి జీవించాలని కోరుకుంటున్నారు తప్ప ఉచిత పథకాలకు ఆశపడటం లేదని అన్నారు. మహారాష్ట్ర ఫలితాలను చూస్తే స్పష్టం అవుతుందన్నారు. తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

వరికొయ్యలను భూమిలో కలియదున్నాలి



కట్టంగూరులో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో గిరిప్రసాద్

హాలియా, అడవిదేవులపల్లి, కట్టంగూరు, నవంబరు 23: వరికోతల అనంతరం రైతులు వరికొయ్యలను కాలుస్తున్నారని, వాటిని భూమిలో కలియదున్నాలని అనుముల, అడవిదేవులపల్లి, కట్టంగూరు, మండల వ్యవసాయాధికారులు సరిత, గిరిప్రసాద్ అన్నారు. ఆయా మండలాల్లో శనివారం రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల భూసారాన్ని పెంచే సూక్ష్మజీవులు చనిపోతాయని, వాతావరణం కాలుష్యం ఏర్పడుతుందన్నారు. రైతులు డీఏపీ భాస్వరం ఎరువుకు బదులుగా సూటి ఎరువులను గాని కాంప్లెక్స్ ఎరువులు, పీఎస్‌బీ(భాస్వరం కలిగించే బ్యాక్టీరియా)ను గాని వాడాలని ఆమె సూచించారు. రైతులందరు పీఎం కిసాన్ ఈకేవైసీ, ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని సూచించారు. వరి కొయ్యలు నేలలో తొందరగా మురగడానికి ఎస్ఎస్‌పీ(సింగిల్ సూపర్ పాస్పెట్) ను పొలంలో చల్లి భూమిలో కలియదున్నాలని సూచించారు. వరి కొయ్యలను కాల్చడం వలన మేలు చేసే కీటకాలు నశిస్తాయన్నారు. రైతులందరూ పీఎం కిసాన్ ఈకేవైసీ, ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని సూచించారు. అనుముల మండలం యాచారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఏఈవో అరవింద్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. అడవిదేవులపల్లి మండలంలో నిర్వహించిన సమావేశంలో ఏఈవోలు రావుల నరేష్, మహేష్‌నాయక్, రైతులు అన్నపు వెంకటేశ్వర్లు, పేర్ల రామయ్య, కట్టంగూరులో ఏఈవో పరశురాములు, రైతులు యాదయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఈ సంఘటన పెద్దఅడిశర్లపల్లి మండలం మాదారిగూడెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం చిలుకల సైదులు గేదె వ్యవసాయ పొలంలో మేత మేయడానికి వెళ్లింది. మేత మేస్తుండగా విద్యుత్ పోల్‌కు వైర్లు కిందికి జారడంతో అటుగా వెళ్లిన గేదె ఆ వైర్లకు తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని, తమకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరారు.

తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలి

చందంపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో శ్రీలక్ష్మీ కంప్యూటర్ ఆపరేటర్లను సూచించారు. శనివారం మండల కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్లకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో 97శాతం సర్వే పూర్తయిందని, వివరాలను సమగ్రంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, కంప్యూటర్ ఆపరేటర్ అనిల్, మీసేవ నిర్వాహకులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా అయ్యప్ప మహాపడిపూజ



అంగడిపేటలో నిర్వహించిన మహాపడి పూజలో పాల్గొన్న మాలధారులు

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'స్వామియే శరణం అయ్యప్పా.. అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో అంగడిపేట ఎక్స్‌రోడ్డు మార్మోగింది. శుక్రవారం రాత్రి మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించిన మహాపడి పూజ మహోత్సవం శబరిగిరీష భక్త బృందంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. తాంత్రిక గురుస్వామి సత్యనారాయణ ఆధ్వర్యంలో గణపతి పూజ, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామికి 18 రకాల అభిషేకాలు, కలశపూజ, నైవేద్యం, మహాహరతి, అనంతరం పడిని వెలిగించారు. ఈ మహాపడిపూజ మహోత్సవానికి అధిక సంఖ్యలో అయప్ప స్వాములు, భ క్తులు పాల్గొని భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో గురుస్వాములు బైరు యాదగిరి, అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యోలుగూరి భాస్కర్‌రెడ్డి, రమావత్ రవినాయక్, వేముల రవి, వంటేద్దు చిన్నపురెడ్డి, సురేష్,నాగయ్య, నారాయణరెడ్డి,స్వాములు గున్‌రెడ్డి జనార్ధన్‌రెడ్డి, వంటెద్దు భాస్కర్‌రెడ్డి, కోన వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ అలుగుబెల్లి శోభారాణిఏ.వి.రెడ్డి, వీరమళ్ళ పరమేష, బిక్షమయ్య, గజ్జెల సుభద్ర చిత్తరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడటౌన్, నవంబరు 23: బీసీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్‌ను సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు. బీసీ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. విద్యాలయాల్లో స్కావెంజర్లు ఏర్పా టు చేయాలని సూచించారు. జూలై నుంచి పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.